ఓం శ్రీ సాయిరాం

# హైదరాబాద్‌లో డిజెపి (ధీనజనోద్ధరణ పథకం)

## నా అనుభవాలు :

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి అనుగ్రహ ఆశీర్వాదాలతో హైదారాబాద్‌లో ధీనజనోద్ధరణ పిల్లల కార్యక్రమము మే నెల 2006 సంllలో ప్రారంభించబడినది. బాబావారు పుట్టపర్తిలో ఈ సేవను ప్రారంభించి శాశ్వత ప్రాతిపదిక కార్యక్రమమునకు నాంది పలికినారు. దీనిని ఆదర్శముగా తీసుకొని తల్లితండ్రులు ఇద్దరిని గాని ఇద్దరిలో ఏ ఒక్కరిని గాని కోల్పోయిన చిన్నారి బాలురను ఈ పథకములో చేర్చుకొని వారికి తగిన వసతి ఏర్పరిచి విద్యాబుద్దులు నేర్పించి వారిని భావి పౌరులుగా, ఉత్తమమైన విద్యార్దులుగా తీర్చిదిద్దడము ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశము.

ఈ కార్యక్రమమును ప్రారంభించాలనే సత్‌సంకల్పము సరూర్‌నగర్ సేవాదళం వారికి కల్గడము మరి వారు మా స్వగృహములో పిల్లలకు వసతి ఏర్పాటు చేయమని ఆడిగినపుడు నేను, నా కుటుంబ సభ్యులము ఏంతో ఆనందించినాము. నలుగురు (4) బాలురును ఎంపిక చేయడం జరిగినది. ఈ కార్యక్రమ నియమం ప్రకారం 6-8 సంవత్సరాల వయస్సుగల బాలురను మాత్రమే తీసుకోవాలి. కాని మాకు పిల్లల ఎంపిక రోజు విపరీతమైన వర్షము రావటం మరి ఎంతో మంది వస్తారనుకున్న మాకు నలుగురు మాత్రమే వచ్చినారు. సరూర్‌నగర్ మందిరంలో సాయంత్రం 8 గంll తదుపరి ఒక పెద్ద వయస్సున్న వ్యక్తి తన మనుమణ్ణి (13 సంll) చిll అరుణ్ అనే అబ్బాయిని ఈ పథకంలో చేర్చుకోమని చాలా ప్రాధేయపడ్డాడు. కాని నియమాల ప్రకారము ఆ అబ్బాయిని చేర్చుకోరాదు.కార్యకర్తలం ఆలోచనలో పడ్డాము. ఆ అబ్బాయి తెలివితేటలు పరీక్షిద్దామని ఇంగ్లీష్, లెక్కలు, చిన్న క్విజ్ ఇచ్చి చూస్తే చాలా చక్కగా చేసినాడు. ఆ పిల్లవాడు 6 నెలల వయస్సులో తల్లితండ్రులు ఇద్దరిని కోల్పోయినాడు. అతను బాబావారి దర్శనము రెండుసార్లు చేసుకున్నానని చెప్పినాడు. కాస్త ధైర్యం చేసి చిll అరుణ్‌ను ఈ పథకంలో చేర్చుకున్నాము. తదుపరి మాకు స్వామి ప్రణాళిక ఏ విధంగా ఎంత చక్కగా ఉంటుందో అర్ధమైంది. అరుణ్ సంస్కారవంతుడవడం వల్ల మిగతా నల్గురి చిన్న పిల్లలకు ఒక పెద్ద అన్న వలె వుండి వారిని తీర్చిదిద్దడంలో తదుపరి రెండు సంత్సరాలలో ఎంతో ప్రముఖ పాత్ర వహించినాడు. అరుణ్ ఈ రోజు ఒక ప్రతిష్టాత్మకమైన కళశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడు. హైదరాబాద్‌లో ఈ డి.జె.పి కార్యక్రమము ప్రారంభించే ముందు ఎన్నో సమస్యలు, అనేకమైన ఒడిదుడుకులు ఎదుర్కొన వలసివచ్చినది. పిల్లలను తీసుకున్న తదుపరి జూన్ 20వ రోజు 2006 నాడు ప్రశాంతినిలయంలో పుట్టపర్తి ధీనజనోద్ధరణ బాలుర 4వ వార్షికోత్సవము బాబావారి సమక్షంలో జరిగినది.

ఆ రోజు స్వామి వారు సుమారు 90 నిమిషాలు కార్యక్రమమును తిలకించి అందరిని ఆశీర్వదించినారు. ఎన్నో సమస్యల మధ్య ప్రారంభమైన హైదరాబాదు డి.జె.పి కార్యక్రమము గురించి నేను ప్రశాంతి నిలయంకి వెళ్లి బాబావారిని ప్రార్ధించుకున్నాను. ఆరోజు (జూన్ 20, 2006) సాయి కుల్వంత్‌హాల్ లో ముందుకూర్చున్న కొంత మందికి మామిడి పండ్లు పంచినారు. నాకు కూడ స్వామి అనుగ్రహముతో ఒక పెద్ద మామిడిపండు ప్రసాదము గా లభించినది. ఆ పండును అతి జాగ్రత్తగా హైదరాబాదు తెచ్చి డి.జె.పి బాలురతో పాటు మా కుటుంబ సభ్యులము అందరము స్వామి వారి ఆశీర్వాదం ఆ విధంగా లభించినదని భావించి ఆరగించినాము. బాబావారి అనుగ్రహంతో గత 7 సంవత్సరాలుగా మా ఇంటిలో డి.జె.పి కార్యక్రమము నిర్విరామముగా కొనసాగుతున్నది. ఈ కార్యక్రమములో మా ఇంటి వారు అందరము సేవ చేసుకొను మహద్భాగ్యము బాబావారు ప్రసాదించినారు.

2009 లో సరూర్‌నగర్ మందిరం ప్రాంగణములో డి.జె.పి బాలురకు వసతి ఏర్పాటు చేసిన తదుపరి బాలురను అక్కడికి మార్చటం జరిగినది. మరి రెండవ బ్యాచ్ ప్రారంభించవలెనని మా కుటుంబ సభ్యులము ఆలోచించి పిల్లల గురించి సర్వే చేయటం జరిగినది. కాని మూడు నెలల వరకు పిల్లలు దొరకలేదు. ఎన్నో సేవా సమితిలకు కబురు పెట్టనాము. కాని ఎక్కడనుంచి కూడ బాలురు లభ్యము కాలేదు. ఎన్నోసార్లు స్వామి వారికి ప్రార్ధన చేసినాము. చివరికి నేను 'తపోవనం' పారయణం చేసి డి.జె.పి పిల్లలను ఏర్పాటు చేయమని బాబా వారిని ప్రార్థించాను. మా ప్రార్దనలు మన్నించి 5 మంది అనాధలైన బీద పిల్లలను స్వామి ఏర్పాటు చేసారు. ఆ విధంగా రెండవ బ్యాచు ప్రారంబించబడినది. మొత్తం రెండు సెంటర్లలలో కలిపి 15 మంది బాలురు మంచి నడవడిక, క్రమశిక్షణ గలిగి, విద్యలను అభ్యశిస్తు బాబావారి అనుగ్రహమునకు పాత్రులౌతున్నారు.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం వ్రాయవలసిన అవసరమున్నది. 7 సంవత్సరాలుగా ఈ కార్యక్రమము విజయవంత మవుటకు కారణం ఆ భగవాన్ బాబావారి అనుగ్రహముతో పాటు పిల్లలకు అన్ని రకాల సేవలందిస్తున్న శ్రీమతి రాములమ్మ మరియు వారి కూతురు శ్రీమతి వెంకట సుబ్బమ్మ (సుబ్బులు). వారు ఏంతో భక్తితో, ఓపికతో, ప్రేమతో పిల్లలకు సేవలు అందిస్తున్నారు. వారివల్లె ఈ సేవ ఇంత చక్కగా జరుగుతుందనడంలో ఎంత మాత్రము సందేహం లేదు. బాబా వారి అనుగ్రహము శ్రీమతి రాములమ్మ, శ్రీమతి సుబ్బులు మరియు వారి కుటుంబాలాపై వారి సేవలందుకుంటున్న డి.జె.పి బాలురపై ఎల్లపుడు వుండాలని కోరుతూ.

**డి. విష్ణువర్ధన్‌రావు**
**DJP State In Charge**
**for Telangana Districts**
**SSSSO- A.P.**